విద్యుత్ పునరుద్ధరణ పనులు ముమ్మరం

- తాగునీటి సరఫరాకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు
- లైన్ల మరమ్మతులు పూర్తి చేసిన విద్యుత్ శాఖ సిబ్బంది



పుళ్లలో యంత్రం సాయంతో విద్యుత్ స్తంభాలను పాతుతున్న దృశ్యం



గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా



రక్షిత నీటి పథకాల వద్ద జనరేటర్ల వినియోగాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



గాలుల బీభత్సానికి పుళ్ల సబ్‌స్టేషన్‌లో కూలిన షెడ్డు

భీమడోలు: గాలి, వాన బీభత్సంతో పుళ్ల, ఎంఎం పురం గ్రామాల్లో అంధకారం నెలకొంది. విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదిక సమస్య పరిష్కార చర్యలకు ఉపక్రమించారు. హుటాహుటిన పునరుద్ధరణ పనులు చేపట్టి ప్రజలకు విద్యుత్ సరఫరా అందించేందుకు ఆ శాఖ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పలు లైన్లకు మరమ్మతులు చేస్తున్నారు. అవసరమైన చోట స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం రాత్రికి గ్రామాల్లో 80 శాతం విద్యుత్ పునరుద్ధణ చేసారు. గురువారం తుఫాన్ మాదిరిగా పుళ్ల, ఎంఎం పురం, కోడూరుపాడు, దుద్దేపూడి, అన్నేవారిగూడెం, కురెళ్లగూడెంలో వీచిన పెను గాలులకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. రైల్వే ట్రాక్‌పై చెట్లు పడిపోవడంతో వాటిని తొలగించారు. ప్రధానంగా పుళ్ల, అంబర్‌పేట సబ్‌స్టేషన్లలో షెడ్డు కూలిపోయింది. సాంకేతిక లోపం వల్ల పుళ్ల, ఎంఎంపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తాగేందుకు గుక్కెడు నీరు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆదేశాల మేరకు హుటాహుటిన సిబ్బంది కూలిన విద్యుత్ స్తంభాలను పాతి అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. యంత్రాల సాయంతో విద్యుత్ సరఫరాకు అడ్డుగా ఉన్న వాటిని తొలగించారు. విద్యుత్ శాఖ ఏడీఈ కె.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో, ఏఈలు రామస్వామి, భీమేశ్వరరావు లైన్ల మరమ్మతులు పూర్తి చేసారు. పుళ్లలో మంచినీటి నీరు అందించేందుకు కురెళ్లగూడెం, పుళ్ల పెట్రోలు బంకు వద్ద ఇండస్ట్రియల్ ఫీడర్ నుంచి త్రీఫేజ్ కరెంట్‌ను పుళ్లకు కలిపి మంచినీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఎంఎంపురానికి మంచినీటిని అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసారు. తొలుత పుళ్ల పంచాయతీ సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, గ్రామ కార్యదర్శి వైఎంవీ సూర్యలు మంచినీటి సమస్య లేకుండా మంచినీటి పథకాల వద్ద జనరేటర్లు ఏర్పాట్లు చేసి నీటిని పంపింగ్ చేసారు. ఈ పనులను తహసీల్దార్ షంషూద్దీన్, ఇంచార్జి ఎంపీడీవో డి.సత్యనారాయణ పర్యవేక్షించారు. గ్రామాల్లో ప్రజలు మంచినీటి ఇబ్బందులు రాకుండా స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసారు.

మతిభ్రమించి మాట్లాడుతున్న చంద్రబాబు

దెందులూరు: చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఏలూరు జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు తలారి రామకృష్ణ, కొవ్వలి ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి, రంగారావు, మాజీ ఎంపీటీసీ గొరిపర్తి శ్రీనివాస యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కొవ్వలిలో యాదవ సంఘ నేతలు, ప్రజాప్రతినిధులు చంద్రబాబు అహంకారంతో చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావును, యాదవ కులాన్ని చంద్రబాబు అవమానించడం దుర్మార్గమని, ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబుకు ఎప్పుడు, ఎక్కడ ఏం మాట్లాడాలో తెలియకపోవడం బాధాకరమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పెరుగుతున్న కీర్తిప్రతిష్ఠలను తట్టుకోలేక ఏం చేయాలో తెలియని స్థితిలో చంద్రబాబు మాట్లాడటాన్ని ఖండించారు. వచ్చే ఎన్నికల్లో యాదవులందరినీ కించపరిచినందుకు తప్పక చంద్రబాబు మూల్యం చెల్లించుకుంటారని, అతి త్వరలోనే చంద్రబాబుకు మరోసారి ప్రజలందరూ గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు: నారాయణపురం విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు, నిర్వహణ పనులు కారణంగా ఈ నెల 14న ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీరామ్ శుక్రవారం తెలిపారు. రాచూరు, సీతారామపురం, రావులపర్రు, నారాయపురం 1టౌన్, అన్ని ఐస్ ఫ్యాక్టరీలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

చేబ్రోలు కాలనీలో విద్యుదీకరణ పనులు



చేబ్రోలులో విద్యుత్ పనులు చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: చేబ్రోలు కాలనీలో విద్యుదీకరణ పనులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం విద్యుత్ స్తంభాలు, లైన్లు ఏర్పాటు పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సహకారంతో ఈ పనులు నిర్వహిస్తున్నారు. సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి ఈ పనులు పర్యవేక్షించారు. సచివాలయ ఇంజనీరింగు నాగబాబు, కళ్యాణి ఉన్నారు.

ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో జీవించాలి



కొవ్వలి వ్యాకులమాత మూడో వార్షికోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ప్రతి ఒక్కరూ దేవునికి లోబడి ఆయన అజ్ఞానుసారం క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో జీవించాలని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం కొవ్వలిలో పోతునూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ పీ. డేవిడ్, కొవ్వలి సంఘ పెద్దలు, గ్రామస్తులు, యువత ఆధ్వర్యంలో వ్యాకుల మాత మూడవ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. తొలుత ఎమ్మెల్యే వ్యాకుల మాత విగ్రహం వద్ద ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇంటేటి మధులతా గంగాధర్, వైస్ చైర్మన్ కాటి సుధాకర్, మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి రంగారావు, ఫాధర్లు, సంఘస్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో 4వ రోజు ఉత్సావాలు పురస్కరించుకుని లిల్లీ పూలతో ప్రత్యేక పూజలు చేశారు. అప్పనవీడు గ్రామానికి చెందిన పాబోలు సుధాకర్ దంపతులు, తవ్వా రవితేజ దంపతులు ఈ పూజల్లో పాల్గొని స్వామికి సహస్ర నామార్చనలు చేశారు. ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం 6గంటల నుంచి అష్టావధాని గరికపాటి నర్సింహరావు ప్రవచనం ఏర్పాటు చేశారు. భక్తుల సందర్శన కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చలివేంద్రం ప్రారంభం

దెందులూరు: దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రాన్ని తహసీల్దార్ నాంచారయ్య శుక్రవారం ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చలివేంద్రం ప్రారంభించడం జరిగిందని, అన్ని గ్రామాల్లో రెవెన్యూ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాన్ని ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓల దెందులూరు మండల సంఘ అధ్యక్షుడు కిషోర్, ఇతర గ్రామాల వీఆర్‌ఓలు తదితరులున్నారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

భీమడోలు: గుండుగొలనులో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేసారు. స్వామి వారికి క్షీరాభిషేక పూజలు చేసారు. ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు

దెందులూరు: రైల్వేశాఖ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు తాను కృషి చేస్తానని రైల్వే జోనల్ యూజర్ కన్సల్టెన్సీ కౌన్సిల్ బోర్డు మెంబర్ గుమ్మడి వెంకట చైతన్య కృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైల్వేశాఖ తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రాంతాల వారీగా ప్రయాణీకులకు ఉన్న సమస్యలు వార్షిక సమావేశాల్లో జోనల్ రైల్వే అధికారులకు వివరించి సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. జోనల్ స్థాయిలో ఉన్న సమస్యలపై తొలుత సర్వే నిర్వహించి ప్రయాణీకుల నుంచి సమస్యలు తెలుసుకోవడానికి తొలిప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు.

సేవా దృక్పథంతో వైద్యసేవలు అందించాలి



పిప్పర పీహెచ్‌సీలో నర్సడే నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జాకబ్, ప్రిన్సిపాల్ దేవి

గణపవరం: రోగులకు సేవా దృక్పథంతో వైద్యసేవలు అందించడంలో లేడి విత్ ది ల్యాంప్‌గా పేరుతెచ్చుకున్న ఫ్లోరెన్స్ నైటింగేల్ బాటలో నర్సులంతా నడవాలని గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ దివ్య అన్నారు. శుక్రవారం జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా పిప్పర పీహెచ్‌సీలో ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైద్య సిబ్బంది కొవ్వొత్తులు వెలిగించి నైటింగేల్ ఆశయ సాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. పీహెచ్ఎన్ అన్నాకుమారి, వైద్యసిబ్బంది, నర్సులు పాల్గొన్నారు.

నర్సింగ్ వృత్తి ప్రాముఖ్యమైంది

పెదవేగి : నర్సింగ్ వృత్తి సమాజంలో చాలా ప్రాముఖ్యమైందని సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాథర్ జి జాకబ్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల నర్సింగ్ కళాశాల్లో ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇంటర్నేషనల్ నర్సింగ్ డే గా కళాశాల నైటింగేల్ పుట్టినరోజులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఫాథర్ పి జాకబ్ మాట్లాడుతూ విధులు గురించి వారు చేసే సేవలు గురించి తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ జి దేవి మాట్లాడుతూ నర్సులు హాస్పిటల్ నందు ఎంతో ప్రాముఖ్యత గల వృత్తి అని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమానికి వివిధ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీస్, ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు సత్వరం మంచినీటిని అందించాలి



పుళ్లలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఏడీఈకు సూచిస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: గాలి వాన బీభత్సానికి గురైన బాధిత గ్రామాల్లోని ప్రజలకు మంచినీటి అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం తుఫాన్ తరహాలో వచ్చిన గాలి వాన బీభత్సానికి పుళ్ల, ఎంఎంపురం, కోడూరుపాడు, అన్నేవారిగూడెం, దుద్దేపూడి, కురెళ్లగూడెం గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో తీవ్ర విద్యుత్ అంతరాయం ఏర్పడింది. గ్రామాల్లో మంచినీటి సరఫరాకు ఇబ్బందులు నెలకొనడంతో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే వాసుబాబు పుళ్ల, ఎంఎంపురం గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో చేపట్టిన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను ఆయన పరిశీలించారు. సంబంధిత అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోని ప్రజలకు తాగునీటిని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఎట్టి పరిస్థితుల్లోని మంచినీటి పథకాలకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను చేయాలని సంబంధిత ఏడీఈ కె.గోపాలకృష్ణకు సూచించారు. విద్యుత్ శాఖకు రూ.70 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, సుమారు 120 విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని, వాటిన్నింటినీ పునరుద్ధరిస్తుమని ఎమ్మెల్యేకు ఏడీఈ వివరించారు. త్వరితగతిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని వాసుబాబు సంబంధిత ఉన్నతాధికారులను కోరారు. శనివారం ఉదయానికి గ్రామాల్లోని సరఫరాను పునరుద్ధరిస్తామని ఏడీఈ వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, ఎంపీపీ కనమాల రామయ్య, డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి రాజీలు, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, తహసిల్దార్ షంషూద్దీన్, ఏవో ఎస్‌పీవీ ఉషారాణి, ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి హరిబ్రహ్మానాయుడు, ఎంపీటీసీలు గొండు కృష్ణచైతన్య, బొల్లారపు జ్ఞానరమ్య పవన్, గంటా శ్రీనివాసరావు, ఎంసీ ఉపాధ్యక్షుడు పులిచర్ల వెంకటకృష్ణారావు, రాష్ట్ర కార్యదర్శి ఎం.జాన్సన్, జగన్‌సేవాదళ్ నియోజకవర్గ కన్వీనర్ తుమ్మగుంట రంగ, సచివాలయ ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమలతోనే అంటువ్యాధుల వ్యాప్తి



డ్రమ్ములో నిల్వ నీటిలో పెరుగుతున్న దోమలను చూపుతున్న వైద్యసిబ్బంది

గణపవరం: డెంగీతోపాటు అనేకరకాల అంటు వ్యాధులకు మూలం అపరిశుభ్రత, దోమలేనని, వాటి నిర్మూలనతో అంటు వ్యాదులకు దూరంగా ఉండవచ్చునని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. గణపవరం పంచాయతీ పరిధిలోని నాలుగు సచివాలయాల్లో ప్రజలకు ఫ్రైడే డ్రైడేగా పాటించాల్సిన అవసరం, డెంగీ, మలేరియా వ్యాధుల వ్యాప్తి, లక్షణాలు, దోమల వ్యాప్తి, నివారణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారంలో ఒకరోజు ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించడంవల్ల దోమల వ్యాప్తిని చాలావరకు అరికట్టవచ్చునన్నారు. ఈసంద ర్భంగా వారు ఇళ్లవద్ద వాడుకలోలేని పాత్రలు, రుబ్బు రోలు, పాత ప్లాస్టిక్ పాత్రల్లో నిల్వఉన్న నీటిలో పెరుగుతున్న దోమల లార్వాను ప్రజలకు చూపించి అవగాహన కల్పించారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, వెన్నునొప్పి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించి, రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, ఆరోగ్య సహాయకుడు యోహాన్, పీహెచ్ఎన్ వరలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు వినియోగించుకోవాలి



కాశిపాడులో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి ప్రియాంక

గణపవరం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండాలని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. శుక్రవారం గణపవరం మండలం కాశిపాడు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం, 104 వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా 8 మంది గర్భిణులకు, ముగ్గురు బాలింతలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. సాధారణ వ్యాధిగ్రస్తులు, కిశోర బాలికలు, అంగన్‌వాడీ పిల్లలు బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన ఇద్దరు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, డేటా ఆపరేటర్ వసంత, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఏఎస్ఎం శివకుమారి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



దెందులూరు గ్రంథాలయంలో కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

దెందులూరు: విద్యతోనే అభివృద్ధి, అవగాహన సాధ్యపడుతుందని దెందులూరు గ్రంథపాలకురాలు రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం గ్రంథాలయాల ప్రత్యేక వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా దెందులూరు గ్రంథాలయం, పోతునూరు గ్రంథాలయంలో కంప్యూటర్‌పై అవగాహన, పుస్తక పఠనం, కథలు చెప్పడం చేశారు. విద్యార్థులకు గ్రంథాలయ శాఖ వేసవి సెలవుల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడంపై ఉన్నత పాఠశాల గ్రంథపాలకుడు ముళ్లపూడి వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

గుండుగొలను సొసైటీ చైర్మన్‌గా వగ్వాల భాస్కర్

భీమడోలు: హైకోర్టు ఆదేశాల మేరకు గుండుగొలను సొసైటీ చైర్మన్‌గా వగ్వాల భాస్కర్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కోపరేటివ్ సొసైటీ భీమడోలు బ్రాంచ్ సర్కిల్ సూపర్‌వైజర్ వి.సతీష్‌కుమార్ వగ్వాల భాస్కర్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వగ్వాల భాస్కర్‌ను వివిధ పార్టీలకు చెందిన నాయకులు అభినందించారు. రైతులకు గతంలో మాదిరిగా సేవలందిస్తానని భాస్కర్ తెలిపారు.

చెరువుల కేటాయింపుపై అధికారుల నిర్లక్ష్యం



ఉంగుటూరులో మాట్లాడుతున్న జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య

ఉంగుటూరు: రజకులకు వృత్తి చెరువులు కేటాయింపుపై పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. శుక్రవారం ఉంగుటూరు నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా రజకులు చెరువులను నమ్ముకుని వృత్తిని చేసుకుంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం సైతం వారి అభివృద్ధి కోసం చెరువుల కేటాయింపు, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, పంచాయతీలు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. దీని వల్ల రజకులకు ప్రభుత్వం కల్పించిన హక్కులను కోల్పోయే పరిస్థితి ఉందని ఆయన అన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు వి.శ్రీను, నిడమర్తి లక్ష్మయ్య, పెద్దిరాజు, రాఘవులు, సత్తియ్య, ఆచంట నాగేశ్వరరావు, వెంకన్న, వేములపూడి తాతారావు, మానురాజు వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలు పాటించాలి



హీరో ఎక్స్‌టెక్ వాహనం తాళాలను కొనుగోలుదారుకు అందిస్తున్న సీఐ ప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): హీరో మోటోకార్ప్ సంస్థ అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన హీరో సూపర్ స్ప్లెండర్ ఎక్స్‌టెక్ వాహనాన్ని స్థానిక సాయి స్వర్ణ మోటార్స్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఏలూరు త్రీటౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కేవీఎస్ వరప్రసాద్ నగర మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ద్విచక్రవాహనాల వినియోగం గణనీయంగా పెరిగిందని, ముఖ్యంగా యువత తమకు నచ్చిన వాహనాలు వినియోగిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ తమ వాహనంతో రహదారిపైకి వచ్చినప్పుడు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని, తమ డ్రైవింగ్ ద్వారా ఇతరులకు హాని కలిగించరాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సాయిస్వర్ణ షోరూం సర్వీస్ మేనేజర్ ఐ. పవన్ కుమార్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



భీమడోలులో చిన్నారులకు యోగాసనాలు నేర్పుతున్న ఆరా ఫౌండేషన్ నిర్వాహకులు

భీమడోలు: యోగా ద్వారా మానసిక ప్రశాంతత, ఏకాగ్రతతో పాటు సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని ఆరా ఫౌండేషన్ అధినేత భవనారుషి అన్నారు. భీమడోలు, పుళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఐదో రోజైన శుక్రవారం కొనసాగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన చిన్నారులకు కథలు చెప్పడం, వినడం, యోగాసనాలు, స్పోకెన్ ఇంగ్లీషు తదితర అంశాలపై చిన్నారులకు తర్ఫీదును అందించారు. యోగా ట్రైనర్ భావనరుషి యోగాసనాల ఆవశ్యకతను వివరించారు. రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, సత్యేంద్ర చిన్నారులకు పలు అంశాలపై శిక్షణనిచ్చారు. గ్రంథపాలకులు కె.శ్రీనివాస్, డీఎస్‌టీ అమర్‌నాథ్, జి.నాగమణి, సిబ్బంది, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా స్వచ్ఛ సంకల్ప రిక్షాలు

ఉంగుటూరు: ఆరు నెలలు పైబడి స్వచ్ఛ సంకల్పం రిక్షాలు ఉంగుటూరులోని ఎంపీడీవో ఆఫీసు వెనుక మూలుగుతున్నాయి. ఎండకు, వానకు తడుస్తూ తుప్పు పడుతున్నాయి. 2021 నుంచి ఇప్పటికి మూడు దఫాలుగా 71 రిక్షాలు మండలానికి వచ్చాయి. వీటిలో కొన్ని రిక్షాలు గ్రామ పంచాయతీలు తీసుకుపోగా 8 వరకు మిగిలిపోయాయి. అవి ఎంపీడీవో ఆఫీసు వెనుక తుప్పల్లో మొక్కలు మధ్యలో ఉన్నాయి. ఈ విషయంపై ఈవోపీఆర్డీ షంషుద్దీన్ ప్రశ్నించగా వాటిని రావులపర్రు, ఉప్పాకపాడు, బొమ్మిడి పంచాయతీలకు ఒక్కొక్కటి, వెల్లమిల్లి , కైకరం పంచాయితీకి రెండు చొప్పున కేటాయించామని వాటిని వినియోగంలోకి తీసుకువస్తామని వివరించారు. అదనంగా వచ్చిన రిక్షాలు మాత్రమే మండల కార్యాలయంలో ఉన్నాయని తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి



పెదవేగిలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెదవేగి : మండలంలో విధులు నిర్వహించే సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో పని చేయాలని పెదవేగి జెడ్పీటీసీ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు అన్నారు. బుధవారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం సర్వసభ్య సమావేశం అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించారు. పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయశాఖాధికారిణి ముత్యాల ప్రియాంక మాట్లాడుతూ వ్యవసాయశాఖ యాంత్రీకరణలో భాగంగా వచ్చిన వివిధ యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. జడ్పీ వైస్ చైర్మన్ విజయ్ బాబు మాట్లాడుతూ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మిగతా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో రైతులకు, ప్రజలకు, వివిధ వర్గాల ప్రజలకు సబ్సిడీపై ఇచ్చేవాటిని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అర్హులకు పథకాలు చేరేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జి రాజ్‌మనోజ్, తహసీల్దార్ ఎస్. నాగరాజు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.